క్లుప్తంగా

పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు, నాయకులు

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి జిల్లా కేంద్రంలో స్థలం కేటాయించాలని కోరుతూ డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి బుధవారం కలెక్టర్ హనుమంతరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, పీసీసీ పరిశీలకులు లకవత్ ధన్వంతరి, పులి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి రాయించుకుని.. పట్టించుకోవడం లేదు

– వృద్ధుడి ఆవేదన

బొమ్మలరామారం : ఆస్తిని రాయించుకున్న కుమార్తెలు ఇప్పుడు తమ పోషణ బాధ్యత చూడడం లేదని బొమ్మలరామారం మండలంలోని చౌదర్‌పల్లి వాసి పక్కీరు భూపాల్ రెడ్డి బుధవారం కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టర్ లేకపోవడంతో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. తమకున్న 33 ఎకరాల భూమిని తమ ఐదుగురు కుమార్తెలు వారి పేరున రాయించుకున్నారని పేర్కొన్నారు. వారు తమను పట్టించుకోకపోవడంతో ఏడాది క్రితం ఆర్డీఓకు దరఖాస్తు చేసుకున్నామని, రూ.2లక్షల చొప్పున 10లక్షలను తమ ఖాతాలో జమ చేయాలని, ఆరు నెలలకు ఒక్కో కుమార్తె 50 కేజీల చొప్పున బియ్యం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినా తమ కుమార్తెలు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కలెక్టర్ వారికి నోటీసులు ఇచ్చినా పట్టించుకోవడం లేదని, తమకు న్యాయం చేయాలని వాపోయాడు.

పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



బండకొత్తపల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

గుండాల : పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు ఎర్ర సుధాకర్ అన్నారు. మండలంలోని బండకొత్తపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాల కల్పిస్తున్న వసతులను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషశ్రీ, అంగన్‌వాడి టీచర్ విక్టోరియా, మహేష్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని రెడ్డిబాయి గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు బుధవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడె ఆకుల ఇంద్రాసేనారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన భీమిడి శ్రీధర్‌రెడ్డి, గుండ్లపల్లి రాంప్రసాద్, పిసాటి జనార్దన్‌రెడ్డిలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయ దేవేందర్, నాయకులు పిసాటి శ్రీధర్‌రెడ్డి, పల్లె వెంకటేశం, ఆవుల శివాజీ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు ప్రారంభం

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్ కార్యాలయంలో సాంకేతిక కారణాలతో నెల రోజులుగా రద్దయిన ఆధార్ సేవలను తిరిగి ప్రారంభించినట్లు సబ్ పోస్టు మాస్టర్ రచ్చ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

వలిగొండ : మండలంలోని దుప్పెల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతన్న వారిపై దాడి చేసి 8 మందిని పట్టుకున్నట్లు ఎస్సై యుగంధర్ బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 7800 నగదు, 8 స్మార్టు ఫోన్లు , 2 ప్యాకెట్ల ప్లేయింగ్ కార్డ్సను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

మోత్కూరులో గంజాయి పట్టివేత

మోత్కూర్: మున్సిపల్ కేంద్రంలో బుధవారం సాయంత్రం పోలీసులు 90 గ్రాముల గంజాయి పట్టుకున్నారు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. స్టైల్ వెంచర్ హోం వద్ద ప్రొబేషనరీ ఎస్ఐ నోయల్‌రాజ్, కానిస్టేబళ్లు హుస్సేన్, మహేష్, శ్రీనివాస్, ఖదీర్ వాహనాలు తనిఖీ చేస్తుండగా.. జనగామ జిల్లా కొడకండ్ల మండలం పాకాలకు చెందిన బుర్కా సాయి, మోత్కూరుకు చెందిన కోల దినేష్, గుండాల మండలం గంగాపురానికి చెందిన అవుల భరత్, బొంతు రాము గంజాయితో దొరికారు. వీరిలో బొంతు రాము పరారీ కాగా మిగతా ముగ్గురిని అదుపులోకి తీసుకుని రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్ ని మిత్తం కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బ్రిడ్జి సరే.. బీటీ రోడ్డేది?

- పల్లెపహాడ్ – సుద్దాల గ్రామాల మధ్య గల పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి
- బ్రిడ్జికి ఇరువైపులా నేటికీ మట్టిరోడ్డే దిక్కు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- బీటీ రోడ్డు వేయాలని వేడుకోలు



పల్లెపహాడ్ - సుద్దాల గ్రామాల మధ్య పెద్దవాగుపై నిర్మించిన బ్రిడ్జి



బ్రిడ్జికి ఒక వైపు అధ్వానంగా ఉన్న మట్టిరోడ్డు

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూరు(ఎం) మండలంలోని పల్లెపహాడ్, గుండాల మండలంలోని సుద్దాల గ్రామాల మధ్య పెద్ద వాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ బ్రిడ్జికి ఇరువైపులా బీటీరోడ్డు లేకపోవడంతో మట్టిరోడ్డుపై ప్రయాణించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పల్లెపహాడ్, పారుపల్లి, టి. రేపాక, ఉప్పలపహడ్, రహీంఖాన్‌పేట, కొరటికల్, కూరెల్ల, తుక్కాపురం, రాఘవాపురం, పుల్లాయిగూడెం గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం నగామా జిల్లాకు వెళ్తుంటారు. అయితే రాయిగిరి మీదుగా జనగామాకు వెళ్తే 66కిలో మీటర్లు, మండలం నుంచి మోత్కూరు మీదుగా జనగామా వెళ్లాలన్న 56 కిలో మీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. మండల పరిధిలోని పల్లెపహాడ్, గుండాల మండలంలోని సుద్దాల గ్రామల మధ్య ఉన్న పెద్దవాగు మీదుగా వెళ్తే జనగామా జిల్లాకు 35 కిలోమీటర్ల దూరం ఉండడంతో గత ప్రభుత్వం ఈ వాగుపై రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది.

రూ. 9.75కోట్లు మంజూరు

పల్లెపహాడ్ – సుద్దాల గ్రామాల మధ్య గల పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి 2021లో అప్పటి ప్రభుత్వం రూ. 9.75కోట్లు మంజూరు చేసింది. దీంతో వెంటనే బ్రిడ్జి పనులు చేపట్టి 2023లో పనులు పూర్తి చేశారు. అయితే బ్రిడ్జికి ఇరువైపులా బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో నేటికీ మట్టి రోడ్డే ఉంది. ఈ మట్టి రోడ్డంతా గుంతలు పడి అధ్వానంగా ఉండడంతో ద్విచక్ర వాహనదారులు మాత్రమే ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలు పడితే రోడ్డంతా బురదమయంగా మారి ద్విచక్ర వాహనాలు కూడా రాకపోకలు సాగించలేని పరిస్థితి ఉటుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బ్రిడ్జికి ఇరువైపులా బీటీ రోడ్డు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామం నుంచి వివిధ పనుల నిమిత్తం జనగామా జిల్లాకు వెళ్తుంటాం. పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించడం బాగానే ఉంది. కానీ బ్రిడ్జికి ఇరువైపులా మట్టిరోడ్డు ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి బ్రిడ్జికి ఇరువైపులా బీటీరోడ్డు నిర్మించాలని కోరుతున్నాం.

– పట్టూరి సాంబయ్య, పారుపల్లి

బీటీరోడ్డు నిర్మించాలి



పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించారు. కానీ బ్రిడ్జికి ఇరువైపులా బీటీ రోడ్డు లేకపోవడంతో మట్టిరోడ్డుపై ప్రయాణించ లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో ఈరోడ్డంతా బురదమయంగా మారి అధ్వానంగా ఉంటుంది. బ్రిడ్జికి ఇరువైపులా బీటీ వేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతున్నాం.

– ఏనుగు వెంకట్‌రెడ్డి, పల్లెపహాడ్

అంతర్జాతీయంగా ఇక్కత్ వస్త్రాలను ఎగుమతి చేయాలి



మాట్లాడుతున్న జగదీశ్

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతి చేయడం ద్వారా చేనేత వ్యాపారులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని జగదీశ్ కంపెనీ చైర్మన్, ఎండీ డాక్టర్ జగదీశ్ అన్నారు. బుధవారం పోచంపల్లిలోని చేనేత టై అండ్ డై అసోషియేషన్ భవనంలో తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్(టీజీటీపీసీ), జగదీశ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో చేనేత వ్యాపారులు, కళాకారులకు అంతర్జాతీయ మార్కెటింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ ఎగుమతులను ప్రోత్సహించడంతో పాటు చేనేత కళాకారుల ఆర్థికాభివృద్ధికి ×రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పర్‌ఫార్మెన్స్× ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రోగ్రాంకు జగదీశ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కన్సల్టింగ్ ఆర్గనైజేషన్‌గా, టీజీటీపీసీ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీగా పనిచేస్తుందని చెప్పారు. అనంతరం రిటైర్డ్ ఫారిన్ ట్రేడ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పీఎస్‌బీ శాస్త్రి మాట్లాడుతూ.. విదేశాలకు ఎగుమతులు చేయడానికి వస్త్ర ఉత్పత్తిదారులకు కావల్సిన సర్టిఫికెట్లు, విధివిధానాలను వివరించారు. టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ మాట్లాడుతూ.. గ్లోబల్ మార్కెటింగ్ వల్ల వస్త్ర వ్యాపారులకు మేలు జరుగుతుందని అన్నారు. అనంతరం తడక యాదగిరి రూపొందించిన పోచంపల్లి ఇక్కత్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేశ్, జిల్లా పరిశ్రమల శాఖ సూపరింటెండెంట్ జంగయ్య, మార్కెటింగ్ నిపుణులు డాక్టర్ శ్రీదేవి, శివకుమార్, డాక్టర్ బాలకృష్ణ, సీఈఓ ఎస్. దీపిక, డిప్యూటీ సీఈఓ హేమలత, జిల్లా చేనేతజౌళి శాఖ ఏడీ శ్రీనివాస్‌రావు, ఆలిండియా హ్యాండ్లూమ్ బోర్డు మాజీ డైరెక్టర్ తడక యాదగిరి, ఎన్నం శివకుమార్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చింతకింది రమేశ్, డైరెక్టర్లు, వస్త్ర వ్యాపారులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

రాజాపేట : వయోవృద్ధుల సంక్షేమ సంఘం పట్టణ కమిటీ సమావేశాన్ని బుధవారం గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు బల్ల దామోదర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడిగా ఆడెపు లక్ష్మీనారాయణ, అధ్యక్షుడిగా ఆడెపు శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా కాసోజు బ్రహ్మాచారి, జాయింట్ సెక్రెటరీగా గౌటె రాములు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎర్రగోకుల సత్తయ్య, కోశాధికారిగా నంగునూరి రాజు, సభ్యులుగా బల్ల కృష్ణ, సందిల రామచంద్రం, పబ్బోజు రాధమ్మ, రేగు ఎల్లయ్య, చామకూర భద్రయ్య, పుల్లంగారి లక్ష్మీనారాయణలను ఎన్నుకున్నారు. సమావేశంలో పలువురు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర



ఉపాధిహామీ కూలీలతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

భువనగిరి : కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల అంజయ్య విమర్శించారు. బుధవారం మండలంలోని హన్మాపురం గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా అధ్యకక్షుడు దయ్యాల నర్సింహ, మాజీ ఎంపీటీసీ లక్ష్మీ, కార్మికులు సునిత, బాలమ్మ, గంగమ్మ లక్ష్మీ, కలమ్మ, ఉమా, సరిత పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్ : ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని తెలంగాణ వ్యసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గంగాదేవి సైదులు అన్నారు. మండలంలోని తుప్రాన్‌పేట గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 30 కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బోజ్జ బాలయ్య, నాయకులు మీసాల శ్రీను, గుండ్ల మహేష్, పద్మ, బద్రి నీలమ్మ, దేవి, పావని, భారతమ్మ, వసంత తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

బీబీనగర్ : ఉపాధిహామీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. మండలంలోని కొండమడుగు, గొల్లగూడెం గ్రామాల్లో బుధవారం ఉపాధి కూలీలతో కలిసి ధర్నాకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, భిక్షపతి, శ్రవణ్, హేమలత, లక్ష్మమమ్మ, లావణ్య, మమత పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

వలిగొండ : కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధర పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏలే చంద్రశేఖర్, బొల్ల సుదర్శన్, బందారపు లింగస్వామి, కొప్పుల యాది రెడ్డి, రాచకొండ కృష్ణ, కందుల తానీషా, కట్ట దానయ్య, మైసొల్ల రామ నర్సు, బచ్చు శ్రీనివాస్, లోడే లింగస్వామి గౌడ్, పెన్నింటి నరేందర్ రెడ్డి, బొడిగెఆనంద్, మందుల నాగరాజు, ఎదురుగట్ల వెంకటేశం, బుంగమట్ల మహేష్, అప్పిశెట్టి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

రామన్నపేట : స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. బుధవారం రామన్నపేటలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి ఏడాదిన్నర దాటినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామ పాలన అస్తవ్యస్తంగా తయారైందన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన ప్రచారానికే పరిమితమైందన్నారు. మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు జెల్లెల పెంటయ్య, బల్గూరి అంజయ్య, బోయిని ఆనంద్, హన్మంత్, నాగేష్, గొరిగె సోములు, నాగటి ఉపేందర్, ఎండీ రఫీద్, నాగేష్, మేడి గణేష్, రజిత పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వలిగొండ: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం గుర్నాథ్‌పల్లికి గ్రామానికి చెందిన పంతుల రఘుపతి(42) తనకున్న 8ఎకరాల వ్యవసాయ భూమిలో వరి, పత్తి పంట సాగువేశాడు. వరి దిగుబడి అనుకున్నంత దిగుబడి రాకపోవడంతో పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేకుండా పోయింది. దీంతో జీవితంపై విరక్తితో ఈ నెల 24వ తేదీ సాయంత్రం ఇంట్లో గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

టీజేఎఫ్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ఆత్మకూరు(ఎం): ఈ నెల 31న హైదరాబాద్‌లో నిర్వహించనున్న టీజేఎఫ్ రజతోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం తహసీల్దార్ వి. లావణ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీ ఎండీ షఫీయోద్దీన్, ఆర్ఐ వై. మల్లికార్జునరావు, జూనియర్ అసిస్టెంట్ రవి, జర్నలిస్టులు ఎలిమినేటి నాగేష్, రేగోటి పాండురంగం, చెరుకు మల్లేశం గౌడ్, లోడి భాస్కర్, సిద్ధూ, మామిడి ఇంద్రారెడ్డి, గాడిపెల్లి ఉదయ్‌కుమార్, లింగం పాల్గొన్నారు.

షేక్ ఐరా వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

సాక్షి ఎఫెక్ట్..

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని వంకమామిడి గ్రామానికి చెందిన 14నెలల షేక్ ఐరా క్యాన్సర్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. మెరుగైన వైద్యం చేయించలేక ఆమె తల్లిదండ్రుల పడుతున్న ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో 'చిట్టి తల్లికి పెద్ద కష్టం'శీర్షికన ఈ నెల 27న ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించారు. దాతల ద్వారా సమకూరిన మొత్తం రూ. 61వేల ఆర్థికసాయాన్ని బుధవారం బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లి బాధిత షేక్ జమాల్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా జమాల్ కుటుంబ సభ్యులు సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎం.ఏ షరీఫ్, సుర్వి శివకుమార్‌గౌడ్, కాసుల బాలకృష్ణగౌడ్, బొడిగె శివకుమార్‌గౌడ్, సుంకరి బాలు, దాసరి లింగస్వామి, పాలెం దుర్గాప్రసాద్, లంగారు ప్రకాశ్ పాల్గొన్నారు.

సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి



బొమ్మలరామారం : కరపత్రం ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు



మోటకొండూర్ : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ శాంతినిర్మల

భూదాన్‌పోచంపల్లి : పంటలసాగులో రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్ రాజ్ అన్నారు. బుధవారం మండలంలోని హైదర్‌పూర్ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేలైన వంగడాలు, పంటల మార్పిడి విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ పరమేశ్వరీ, ఏఓ శైలజ, ఏఈఓ నరేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

బొమ్మలరామారం : పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధించొచ్చని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు శకుంతల దేవి, తేజస్విని, ఉపేందర్ రెడ్డి, శ్వేత, లక్ష్మిపూజ, భారతి అన్నారు. మండలంలోని ఫక్కీరుగూడెం, జలాల్‌పూర్, ఖాజీపేట్ గ్రామాల్లో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయం, సాగునీరు, ఎరువుల యాజమాన్యం, పంట మార్పిడిలాంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు అనంతరం రశీదులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో రిసెర్చ్ స్కాలర్ సుష్మ, మాజీ సర్పంచ్ మేడబోయిన గణేష్, ఏఈఓలు వెంకటేష్, మౌనిక రెడ్డి, సింహ ప్రసాద్ పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

మోటకొండూర్ : సాగులో ఎరువుల వాడకాన్ని తగ్గించాలని ఏడీఏ శాంతి నిర్మల అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమాదేవి, ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధకులు యాదగిరి, శాస్త్రవేత్త అనిల్‌కుమార్, పశువైద్యాధికారి సంతోష్‌కుమార్, రాజా మధుశేఖర్, సురేష్, వెంకటేష్, శివాని పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుల వినియోగం పెంచాలి

తుర్కపల్లి : సాగులో పచ్చిరొట్ట ఎరువుల వినియోగం పెంచాలని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ అరుణ అన్నారు. మండలంలోని చిన్నలక్ష్మాపూర్,కొనాపూరం గ్రామాల్లో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. భూముల్లో జిలుగు, జనుము, పెసర, మినుములు వేసి 45 రోజుల తరువాత వాటిని కలియదున్నితే భూసారం పెరుగుతందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అనిల్, ఇందుదర్ రెడ్డి, ఎంఏఈ ఉమాశ్రీ, ఏఈఓలు పృథ్వీ రాజ్, రాకేష్, నర్సింహరెడ్డి, తిరుమలరెడ్డి, నర్సిరెడ్డి, శ్రీను, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజాపేటలో తిరంగా యాత్ర



తిరంగా యాత్రలో పాల్గొన్న నాయకులు

రాజాపేట : ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద సెంటర్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు బుల్లెట్ మాధురి, అఖిలపక్షం, వివిధ కుల సంఘాల నాయకులు, పలువురు ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం చేస్తూ పట్టుబడ్డ వారిపై చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో చింతపండు బస్తాలను దొంగిలించి కారులో తరలించడానికి ప్రయత్నించిన వారిపై చర్య తీసుకోవాలని సీపీఐ నాయకులు బుధవారం ఆలయ డీఈఓ దోర్బల భాస్కర్ శర్మకు వినతి పత్రాన్ని అందజేశారు. దొంగతనంపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ , జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, జిల్లా సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, పెంటయ్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు

బీజేపీ ఆధ్వర్యంలో..

ఆలయ గోదాం నుంచి చింతపండు బస్తాలు దొంగతనం చేస్తూ పట్టుబడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ అధ్వర్యంలో ఆలయ డీఈవోకు వినతి పత్రాన్ని అందజేశారు. దొంగతనంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, సత్య, చంద్రమౌళి, నరేష్, బుచ్చిబాబు, కర్ణ, వాసు దేవరెడ్డి, శివ, సురేష్, దేవ సాయి, అజయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావర్కర్ జయంతి



సావర్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరి : పట్టణ కేంద్రంలో హైదరాబాద్ చౌరస్తా వద్ద బుధవారం వీర సావర్కర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వీర సావర్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి మూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ దేశానికి వీర సావర్కర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సుర్వి శ్రీనివాస్, పోలా శ్రీనివాస్ గుప్తా, మెరుగు మధు, రత్నపురం శ్రీశైలం, నాయకులు నర్ల నర్సింగ్‌రావు, రత్నపురం బలరాం,ఉమాశంకర్, నీలం రమేష్, జనగాం కవితా నర్సింహా చారి, నల్లమాస వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లారీలు లేక నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

- ధాన్యం దిగుమతి చేసుకోవడంలో మిల్లర్ల జాప్యం
- అంకిరెడ్డిగూడెం కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు
- వర్షం భయం.. ఆందోళనలో రైతులు



అంకిరెడ్డిగూడెంలోని కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం బస్తాలు

చౌటుప్పల్ రూరల్: లారీలు లేక మండలంలోని అంకిరెడ్డిగూడెం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. తూకం వేసిన ధాన్యం బస్తాలు సైతం నాలుగు రోజులుగా కొనుగోలు కేంద్రంలోనే నిల్వ ఉంటున్నాయి. లారీలలో లోడ్ చేసి ఎగుమతి చేసిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అంకిరెడ్డిగూడెంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రానికి మలల్లికార్జున రైస్ మిల్, నేలపట్లలోని శ్రీలక్ష్మీ రైస్‌మిల్ తో పాటు మరో మూడు మిల్లులను కేటాయించారు. మల్లికార్జున రైస్ మిల్లు యాజమాన్యం లారీల్లో వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా కొర్రీలు పెడుతున్నారని, రోజుకు 2లేదా 3 లారీలే దిగుమతి చేసుకుంటున్నారని మిగతా మిల్లర్ల మాదిరిగా లారీలను త్వరితగతిన దిగుమతి చేసుకుంటే ఇబ్బందులు ఉండవని కేంద్రం నిర్వాహకులు వాపోతున్నారు. ఓ వైపు వర్షాలు పడుతుండడంతో ధాన్యం కొనుగోలు కాని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ధాన్యం లారీలను త్వరితగతిన దిగుమతి చేసేలా చర్య తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఐదు రోజుల్లో పూర్తి చేస్తాం

అంకిరెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మల్లికార్జున రైస్ మిల్లుకు కేటాయించాం. ఆ మిల్లులో రోజుకు 2,3 లారీలు దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో ఆ సెంటర్‌లో బస్తాలు నిల్వ ఉన్నాయి. ఇప్పటి వరకు మండలలో సుమారు 710లారీల ధాన్యాన్ని మిల్లర్లకు పంపాం. రోజు 6లారీలు దిగుమతి చేసుకుంటే ఐదు రోజుల్లో పూర్తి చేస్తాం.

– రమేష్, సీఈఓ, చౌటుప్పల్ పీఏసీఎస్